క్లుప్తంగా

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సెయింట్‌ఆన్స్ ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థుల ప్రతిభా పాటవాలకు అవధుల్లేవని వారు కొనియాడారు. ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఝాన్సీ, కరస్పాండెంట్ సిస్టర్ తవితలు ప్రారంభిచారు. విద్యార్థులు వివిధ విభాగాలలో చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ అందరిని ఆలోచింపచేశాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు

కడియం: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని రాజమహేంద్రవరం వెటర్నరీ డివిజన్ ఇన్‌చార్జి డీడీ డాక్టర్ కల్లూరి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మార్చి ఒకటి నుంచి నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాయన్నారు. జిల్లాలో 42వేల పశువులకు టీకాలను తమ సిబ్బంది అందిస్తారన్నారు. 31వ విడతగా గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషనల్ ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు దీనిపై అవగాహన పెంచుకుని వ్యాక్సినేషన్‌కు సహకరించాల్సిందిగా సత్యనారాయణ కోరారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఉదయం, సాయంత్రం వేళల్లో టీకాలు వేసేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మార్చి ఒకటి నుంచి ఈ ప్రత్యేక శిబిరాలు ప్రారంభమవుతాయని ఆయన వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

కడియం: మాధవరాయుడుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. 30 రకాల పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూ సారం పెంపొందించేందుకు అనుసరించాల్సిన విధానాలను గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి వేంకటేశ్వరరావు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ శిరీష, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తాతారావు, ఎ.లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా ముడి పదార్థాలు అమ్మితే చర్యలే..

రాజమహేంద్రవరం రూరల్: సారా తయారీకి ముడిపదార్థాలు అమ్మే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఈబీ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణ తెలిపారు. శనివారం ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో ఆయన నార్త్‌స్టేషన్ ఆవరణలో బెల్లపు వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. పి.వి.రమణ మాట్లాడుతూ పేదలకు సారా అందుబాటులో ఉండకుండా దానిలో ఉపయోగించు బెల్లపు అమ్మకాలు–కొనుగోలుపై వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. ఈ విషయంలో ప్రభుత్వానికి సహకరించాలని ఇన్‌స్పెక్టర్ రమణ కోరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి మురళీధరన్ తదితరులు

సీటీఆర్ఐ: ఏపీలో బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, కేంద్ర విదేశాంగ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మురళీధరన్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ జిల్లా ప్రవాస యోజన కమిటీ సమావేశం పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ చేస్తున్న ప్రజా సంక్షేమ పాలనను అందరికీ వివరించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.5.92 లక్షలు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సొంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామి వారి హుండీ ఆదాయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. ఎనిమిది నెలల కాలానికి గాను రూ.5,92,120 వచ్చిందని ఆలయ ఈఓ కొవ్వూరి గాయత్రి తెలిపారు. గతేడాది కంటే ఆదాయం పెరిగినట్లు ఆమె తెలిపారు. గ్రామ పెద్దలు, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

మరో మెట్టెక్కుతున్న నాటక రంగం

- రాజమహేంద్రవరం సిగలో మరో కలికితురాయి
- నాటక రంగానికి పూర్వ వైభవం తేవడానికి ప్రభుత్వం కృషి
- నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సెంటర్ ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఎన్ఎస్‌డీ ఆధ్వర్యంలో భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శన

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం కళలకు పెట్టింది పేరు. ఇక్కడ నాటకాల ప్రదర్శన ఎక్కువ. నాటక రంగం ప్రజలకు కాలక్షేపంతో పాటు వినోదాన్ని, సందేశాన్ని పంచుతుంది. అప్పట్లో నాటకం ప్రదర్శిస్తే ఆయా ప్రాంతాల నుంచే కాకుండా చుట్టు పక్కల నుంచి కూడా ఎద్దుల బండ్లు కట్టుకుని మరి వచ్చి నాటకాన్ని తెల్లవారే వారే వర చూసి ఆనందించేవారు. సురభి వారు ప్రవేశించిన తరువాత నాటక రంగం మరో మెట్టు ఎక్కింది. సురభి వారి లైటింగ్, సౌండ్ ఎఫెక్ట్స్, సెట్టింగ్స్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. జానపద, సాంఘిక, పౌరాణిక నాటకాలు కొన్ని దశాబ్దాల పాటు తమ ప్రాభావాన్ని చాటుకున్నాయి. కానీ సినిమాలు అనే మాధ్యమం రావడంతో నాటకం చిన్నబోయింది. అర చేతిలో ఇమిడిపోయే మొబైల్ వచ్చిన తరువాత థియేటర్‌కి వెళ్లి సినిమాలు చూడడం కూడా తగ్గిపోయింది. కాని కళను నమ్ముకున్న కళాకారులు మాత్రం తమ కళలను బతికించడం కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారు.

నాటకానికి బాట వేసింది కందుకూరే..

తెలుగు నాటకానికి తొలి బాట వేసింది కందుకూరి వీరేశలింగం. 1876లో నాటక రచనకు శ్రీకారం చుట్టి, 1894 వరకు అనంతమైన నాటక సాహిత్యాన్ని తెలుగువారికి అందించారు. కందుకూరి వారు రాసిన నాటకాలలో సంస్కృత, ఆంగ్ల అనువాదాలు, పౌరాణిక, సాంఘిక, అధిక్షేప గర్భ నాటకాలు ఉన్నాయి. 1878లో తొలి తెలుగు నాటకం బ్రాహ్మ వివాహం. దీనినే పెద్దయ్య గారి పెండ్లి అని పిలిచేవారు. తెలుగులో తొలిసారిగా ప్రదర్శితమైన తొలి నాటకం 1880లో రాజమహేంద్రవరంలోని విజయనగర బాలిక పాఠశాలలో విద్యార్థుల చేత వ్యవహార ధర్మబోధిని(ప్లీడర్ నాటకం) ప్రదర్శించారు. 1881లోని తొలి తెలుగు నాటక సమాజాన్ని కూడా ఆయనే ప్రారంభించారు. కందుకూరి అందించిన ఏ నాటకమైన అది కేవలం సామాజిక ప్రయోజనాన్ని ఆశించి రాసినవే. అందుకే తొలి నాటక కర్త, ప్రదర్శన కర్త, నాటక సమాజ నిర్మాణ కర్త మూడు కందుకూరికే దక్కుతాయి.

నాటక రంగానికి కొత్త ఊపిరి

రాష్ట్ర ప్రభుత్వం నాటక రంగానికి కొత్త ఊపిరి పోసింది. కరోనా సమయంలో ప్రదర్శనలు లేక ఆర్థికంగా చితికిపోయిన కళాకారులను ఆదుకోవడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాటక అకాడమీని స్థాపించారు. అంతే కాకుండా కళాకారులు చేత వివిధ చోట్ల ప్రదర్శనలు ఇప్పించి వారికి ప్రోత్సాహక నగదను అందిస్తున్నారు. జగనన్న సాంస్కృతిక సంబరాలు పేరిట రాష్ట్రంలో అనేక నాటకాలను నిర్వహించి వారికి సాయం అందించారు.

ఇక్కడ నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా థియేటర్

అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రతి ఏటా ఢిల్లీలో వివిధ రాష్ట్రాల కళాకారులతో నిర్వహించే నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా శాఖను రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసేందుకు అధికారికంగా అనుమతి లభించింది. థియేటర్ ఆర్ట్స్ ద్వారా అనేక మందికి డైరెక్షన్, యాక్షన్, ఫొటోగ్రఫీ, మేకప్, కొరియోగ్రఫీ, రచయితలుగా తయారు చేయడానికి వీలుగా త్వరలో కోర్సులను ప్రారంభించనున్నారు. అదేవిధంగా కళాకారులకు ఆధునిక హంగులపై అవగాహన పెంచి జాతీయ స్థాయిలో మన నాటకాన్ని ప్రదర్శింప చేయడానికి వీలుగా ఈ ఎన్ఎస్‌డీ ఉపయోగపడనుంది.

ఎన్ఎస్‌డీలో కళాకారులకు తర్ఫీదు



నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా సెంటర్‌నురాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృషి చేశాం. ఇక్కడ ఏర్పాటు చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా అనుకూలత వ్యక్తం చేయడంతో ఇక్కడ త్వరలో సెంటర్‌ను ప్రారంభిస్తాం. థియేటర్ ఆర్ట్స్‌లో వివిధ కోర్సులు చేయడానికి ఉపయోగపడుతుంది. మనం ఇంకా బాలనాగమ్మ, కురుక్షేత్రం, భక్త ప్రహ్లాద వంటి పౌరాణికాల నాటకాల ప్రదర్శనలోనే ఉన్నాం. ఇతర రాష్ట్రాల వారు చాలా అప్‌డేట్ అయ్యారు. లైటింగ్, సౌండ్ సిస్టమ్స్ వంటి లేటెస్ట్ టెక్నలాజీని ఉపయోగించుకుంటున్నారు. వీటి కోసం ప్రత్యేకంగా థియేటర్ కోర్సులు కూడా చేస్తున్నారు. కళాకారులకు తర్ఫీదు ఇవ్వడానికి ఎన్ఎస్‌డీ సెంటర్ బాగా ఉపయోగపడుతుంది.

– ఆర్.మల్లికార్జున రావు, సాంస్కృతిక శాఖ సంచాలకులు

నాటకం లేకపోతే సాహిత్యమే లేదు



నాటకం లేకపోతే అది సాహిత్యమే కాదు అనే నానుడి ఉంది. ఏ నాటకమైనా, నాటక సమాజమైన, పది కాలాలపాటు మన్నాలంటే అందుకు జనాదరణ ముఖ్యం. ఎందుకో మన తెలుగు ప్రేక్షకులు, తెలుగు సాహితీ ప్రక్రియల్లో గొప్పదైన నాటకాన్ని కూడా చిన్నచూపు చూడడం విచారించ దగ్గ విషయం. సినిమా లాగే నాటకాన్ని కూడా ఆదరించే రోజులు ముందున్నాయని ఆశిస్తాను.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, నాటక పరిశోధకుడు

స్వాగతిస్తున్నాం..



నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా శాఖను నగరంలో ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం. జీవగోదావరి తీరాన కళలకు, కళాకారులకు కొదవ లేదు. కానీ వాటిని సక్రమైన మార్గంలో నేటి ఆధునిక హంగులను జోడించి చూపించగలిగితే మన తెలుగు నాటకం మరో మెట్టు పైకెక్కుతుంది.

– మండా కృష్ణమోహన్, విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్

పత్రికా విలువలను కాలరాస్తున్నారు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న చందన నాగేశ్వర్, పార్టీ శ్రేణులు

- అంతా చంద్రబాబు కోసమే..
- వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఈనాడు ప్రతుల దహనం

రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబును వెనకేసుకు వచ్చేందుకే ఈనాడు అధినేత రామోజీరావు పత్రికా విలువలను కాలరాస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. టీడీపీ నాయకుడు పట్టాబీని కొట్టారంటూ రెండేళ్ల కిందట ఫొటోలు పెట్టి ప్రచురించిన 'ఈనాడు' కథనాలకు నిరసనగా శనివారం ఆయన వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరాయంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేకే ఈనాడు అధినేత రామోజీరావు తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారన్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వంపై అబద్ధాలు, అభూత కల్పనలతో అనునిత్యం విషం చిమ్ముతున్నారన్నారు.

సామాజిక న్యాయానికి ప్రతిరూపం సీఎం జగన్

సామాజిక న్యాయానికి ప్రతిరూపం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని చందన నాగేశ్వర్ పేర్కొన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 18 ఎమ్మెల్సీ స్థానాలకు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 14 స్థానాలు కేటాయించి అందరి మనస్సుల్లో సీఎం జగన్ సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారన్నారు. ఇది చూసి ఓర్వలేకే చంద్రబాబు అండ్ కో గన్నవరంలో పట్టాబీతో డ్రామాలు ఆడించి పక్కదోవపట్టించేందుకు ప్రయత్నించారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు, ఎల్లో మీడియాకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రూరల్ నియోజకవర్గంలో కడియం, రూరల్ మండలాల్లో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం పనులు ప్రారంభిస్తారన్నారు. అలాగే పార్టీలో పని చేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతను తీర్చేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చందన పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, రాష్ట్ర వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు దొంతంశెట్టి వీరభద్రయ్య, షేక్ షకీలాబేగం, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, జేసీఎస్ కన్వీనర్ రాజమౌళి, హుకుంపేట సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు, సభ్యుడు చీరారాజు, అంగాడ సత్యప్రియ, బీదంరాజు తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజాను కలిసిన పోశికుమార్

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ధవళేశ్వరం గ్రామానికి చెందిన ముత్యాల పోశికుమార్ దివ్యాంగుల బృందంతో కలిసి శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులు ఐకమత్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దివ్యాంగ సంఘ నాయకులు కండెల్లి రజనీకుమార్, కేవీఆర్ సాగర్, పుష్కర్, బాషా, పలివెల సత్యవేణి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జక్కంపూడి రాజాను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోశికుమార్

ఒకటిన ఆంజనేయ స్వామి కల్యాణోత్సవం

రాజానగరం: శ్రీకృష్ణపట్నంలోని సువర్చలాదేవి సమేత అభయ ఆంజనేయస్వామి ఐదో వార్షిక కల్యాణోత్సవాలు మార్చి ఒకటో తేదీన నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 7.30 గంటలకు కలశపూజ అనంతరం గ్రామంలో కలశ ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం కల్యాణం జరుగుతుంది.

బాలలతోనే సమాజాభివృద్ధి



బాలోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి



ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రకాశం నగర్: బాలలతోనే సమాజాభివృద్ధి సాధ్యమని, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి సమాజానికి అందించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో 'గోదావరి బాలోత్సవాలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభ సూచికగా జాతీయ పతాకాన్ని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ఆవిష్కరించగా, గోదావరి బాలోత్సవం పతాకాన్ని చిన్నారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరంలో బాలోత్సవం మొదటి పిల్లల పండుగను నిర్వహించుకోవడం సంతోషకరంగా ఉందన్నారు. సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే కాదని, అన్ని అంశాలపైనా అవగాహన అవసరమన్నారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అవసరమైన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా బాలలు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు వీవీఎస్ కృష్ణకుమార్ అధ్యక్షత వహించగా, పీఏ రాజబాబు, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, ఆలపాటి నాగేశ్వరరావు, తలారి వాసు, చైతన్య శేఖర్, పి.తులసి, తాడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు సీఎం జగన్

గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో చందన నాగేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: పేద ప్రజల గుండె చప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరు గ్రామంలోని వెంకటాద్రి గార్డెన్స్‌లో కాతేరు, వెంకటనగరం, తొర్రేడు, కొంతమూరు గృహసారథులు, గ్రామ సచివాలయ వలంటీర్లు, కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా చందన నాగేశ్వర్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు చందన దిశానిర్దేశం చేశారు. రానున్న కాలంపార్టీకి ఎంతో కీలకమని చెప్పారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ వెళ్ల జగన్‌మోహన్ రెడ్డి సర్కారు చేపట్టిన పథకాలు, ఆ ఇంటికి చేకూరిన లబ్ధి వివరాలను సవివరంగా లబ్ధిదారులకు తెలియజేద్దామని చందన నాగేశ్వర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాల్ని అందిస్తూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ప్రభుత్వ పథకాలను గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకువెళ్లి మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించాలని కోరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయంకన్వీనర్లు, పార్టీశ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి దారుణం

సీటీఆర్ఐ: టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కుట్ర పూరిత చర్యే అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ ధ్వజమెత్తారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు భయపడి కొడాలి నాని వల్లభనేని వంశీయులు నోరు పారేసుకుంటున్నారని విమర్శించారు. ఇష్టం వచ్చినట్టు వాగితే పార్టీ శ్రేణులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. శాంతి భద్రతల్ని కాపాడాల్సిన పోలీసులే అధికార పార్టీ కార్యకర్తల మాదిరి ప్రవర్తించడం బాధ కలిగిస్తుందన్నారు.